సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 19 । మే । 2024



**ఆధ్యాత్మిక శోభ**
పెనుగొండ క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. వాసవీ మాత జయంతి సందర్భంగా వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో ▸



**హెచ్ఐవీ రోగులకు సత్వర వైద్యం**
తణుకు జిల్లా ఆస్పత్రి సేఫ్ కేర్ సెంటర్‌కు సీడీ ఫోర్ పరికరం ఉన్న ప్రత్యేక ల్యాబ్ అందుబాటులోకి రావడంతో హెచ్ఐవీ రోగులకు సత్వర వైద్యసేవలు అందనున్నాయి. 8లో ▸



**పండు ఈగ ఉధృతి**
అకాల వర్షాలతో మామిడిలో పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉందని, రాలిపోయిన పండ్లు నాశనం చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల వద్ద స్ట్రాంగ్‌రూమ్ రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అజిత

**భీమవరం:** భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను ఎస్పీ వేజెండ్ల అజిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించిన అనంతరం సీసీ కెమెరాల పనితీరు, డ్యూటీ రికార్డులు స్వయంగా తనిఖీ చేసి విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ అజిత మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో ఏర్పాటు చేసిన పటిష్టమైన మూడంచెల భద్రతలో భాగంగా మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, మూడో అంచెలో స్థానిక సివిల్ పోలీసుల్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈవీఎం స్ట్రాంగ్ రూంలు, సెక్యూరిటీ, కారిడార్, సీల్డ్ వేసిన డోర్లను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, కంట్రోల్ రూంకు అనుసంధానం చేసిన సీసీటీవీ కవరేజీతో సహా భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు గెజిటెడ్ అధికారులతో పాటు పోలీసు అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూం ఎంట్రన్స్ గేట్ పరిసరాలలోకి గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను, ఇతరుల వాహనాలకు అనుమతించరాదని ఎస్పీ స్పష్టం చేశారు.

### ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఏపీ ఈఏపీ సెట్‌కు హాజరైన విద్యార్థులు

**భీమవరం:** భీమవరం పట్టణంలోని మూడు ఇంజినీరింగ్ కళాశాలల్లో శనివారం జరిగిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 175 మందికి 168 మంది హాజరయ్యారు. డీఎన్నార్ కళాశాలలో 150 మందికి ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు కాగా.. విష్ణు కళాశాలలోని పరీక్షకు 100 మందికి 97 మంది హాజరయ్యారు.

**460 మంది హాజరు**
**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** ఏపీ ఈఏపీ సెట్ పరీక్షల్లో భాగంగా శనివారం నగరంలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు మొత్తం 460 మంది హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగిన పరీక్షకు సిద్ధార్థ క్వెస్ట్ కాలేజీలో 180 మందికి 174 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 132 మందికి 129 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 160 మందికి 157 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. మొత్తం మీద ఉదయం సెషన్‌లో 472 మందికి 460 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం సెషన్‌లో ఏ పరీక్షా కేంద్రంలోనూ పరీక్ష నిర్వహించలేదు.

### రైళ్ల రద్దుతో ఇక్కట్లు

**పాలకొల్లు సెంట్రల్:** నరసాపురం నుంచి గుంటూరు వరకూ వెళ్లే పాస్ట్ ప్యాసింజర్, డెమో రైళ్ల రద్దుతో పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విజయవాడ డివిజన్ రైల్వే డీఆర్‌యుసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ విజయవాడ డీఆర్ఎంకు లేఖ రాశారు. తూర్పు గోదావరి జిల్లా ప్రజలతోపాటు నరసాపురం, పాలకొల్లు, భీమవరం, కై కలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రద్దు చేసిన రైళ్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

### 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**బుట్టాయగూడెం:** మండలంలోని ఇప్పలపాడు సమీపంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 11వ తరగతి(సీబీఎస్ఈ)లో వివిధ గ్రేడ్‌ల్లో (ఎంపీసీ, బైపీసీ, ఏఎస్‌పి)మిగిలిన ఖాళీలకు 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 18 నుంచి 25 వరకూ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.అమృతకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# గెలుపు.. మీదా.. మాదా?



- ఉమ్మడి జిల్లాలో బెట్టింగ్ బంగార్రాజులకు హై జోష్
- గెలుపోటములపై రూ.కోట్లలో బెట్టింగులు
- సీట్లు, మెజార్టీలపై పెద్ద ఎత్తున పందేలు
- పొలిటికల్ బెట్టింగులతో ఐపీఎల్ బెట్టింగులు వెలవెల
- భీమవరం, తాడేపల్లిగూడెం కేంద్రంగా పందేలు

**సాక్షి ప్రతినిధి, ఏలూరు:** రాష్ట్రంలో ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు రావడానికి రెండు వారాలకు పైగా సమయం ఉండడంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో బెట్టింగ్ బంగార్రాజులు రూ.కోట్లలో పందేలు కడుతూ రెచ్చిపోతున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న సర్వేలు, ప్రచారంతో ముందూ వెనుకా ఆలోచించకుండా బెట్టింగులకు సై అంటున్నారు. గెలుపోటములు మొదలుకుని మెజార్టీలు, ఎక్కడ ఎవరు గెలుస్తారు.. ఇలా వీలున్న ప్రతిదానిపై పందేలకు తెరదీశారు. ఉమ్మడి జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం కేంద్రంగా గత నాలుగు రోజులుగా కోట్ల స్థాయిలో బెట్టింగులు కొనసాగుతున్నాయి. పొలిటికల్ బెట్టింగుల దెబ్బకు ఐపీఎల్ బెట్టింగ్ తెరమరుగైపోయింది.

**ఉండిలో స్వతంత్ర అభ్యర్థి ఓట్లపై పందేలు**
రెండు రోజుల క్రితం పెదతాడేపల్లిలో ఏ రాజకీయ పార్టీ ఏ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే దానిపై రూ. కోటి పందెం కాశారు. జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమలలో రూ.50 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు పందేలు జరుగుతున్నాయి. మరో వారంలో బెట్టింగుల ఫీవర్ తారాస్థాయి చేరనుంది. ప్రధాన రాజకీయ పార్టీల్లో ద్వితీయ శ్రేణి నేతలంతా బెట్టింగులపైనే దృష్టి సారించారు. ఉండిలో మండల స్థాయి నేత ఒకరు అభ్యర్థి గెలుపుపై రూ.కోటి పందెం కట్టారు. అదే విధంగా ఉండిలో స్వతంత్ర అభ్యర్థి సాధించే ఓట్లపైనా పందేలు జోరుగా సాగుతున్నాయి. సాధారణంగా ప్రతి ఏటా ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగులు భారీగా జరుగుతుంటాయి. మరో 9 రోజుల్లో ఐపీఎల్ ముగుస్తున్న క్రమంలో బెట్టింగ్ ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల దెబ్బకు ఐపీఎల్ బెట్టింగుల జోరు తగ్గి పొలిటికల్ పందేలు పెరిగాయి. చింతలపూడి, పోలవరం, నూజివీడు తదితర ప్రాంతాల్లో తెలంగాణాలో ఏ పార్టీకి ఎన్ని ఎంపీ సీట్లు వస్తాయనే దానిపైనా పందేలు జరుగుతున్నాయి.

### సీట్లు, మెజార్టీలపై భారీగా పందేలు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న ముగిసింది. ఏలూరు జిల్లాలో 84 శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 83 శాతం పోలింగ్ నమోదైంది. 2019 పోలింగ్‌తో పోల్చితే సగటున 1.5 శాతం పెరిగింది. అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంతో కొంత పోలింగ్ పెరిగింది. ఏలూరులో 4 శాతం పెరిగింది. దేశ వ్యాప్తంగా ఎన్నికలు షెడ్యూల్ కొనసాగుతున్న క్రమంలో ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయకూడదు. ఈ పరిణామాల క్రమంలో ఎవరికి వారు స్వీయ అంచనాలతో బెట్టింగులు జోరుగా వేస్తున్నారు. జిల్లాలో ఒక పార్టీకి ఇన్ని స్థానాలు వస్తాయని... నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థే గెలుస్తాడని, ఇంత మెజార్టీ వస్తుందని పందేలు కాస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాలపై భారీగా బెట్టింగులు సాగుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటు, మంగళగిరి, పిఠాపురం, ఉండిలో గెలిచే అభ్యర్థులు, నియోజకవర్గాల్లో కీలకనేతల మెజార్టీలపై పందేలు కొనసాగుతున్నాయి. అది కూడా రూపాయికి రూపాయి ఇచ్చేలా కొన్ని పందేలు హాట్ ఫేవరేట్ పేరుతో రూపాయికి రూ. 1.25 నుంచి రెండు రూపాయలు ఇచ్చేలా పందేలు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా పొలిటికల్ బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. ఇరు పక్షాలు మధ్యవర్తి దగ్గర బెట్టింగ్ మొత్తం కలిపి మధ్యవర్తికి 2 నుంచి 5 శాతం వరకు కమిషన్ ఇచ్చి పందేలు కడుతున్నారు.

## శాంతిభద్రతలకు ప్రాధాన్యం

### కలెక్టర్ సుమిత్ కుమార్



**భీమవరం (ప్రకాశంచౌక్):** జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు, ఇతర శాఖలు నిరంతరం కృషి చేశాయన్నారు. స్థానిక విష్ణు కాలేజీలో నాలుగు నియోజకవర్గాలకు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను మూడంచెల భద్రత మధ్య కట్టుదిట్ట భద్రత మధ్య ఉంచామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఎప్పుడైనా స్ట్రాంగ్ రూంలను పరిశీలించుకోవడానికి అవకాశాన్ని కల్పించామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా.. కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎక్కడైనా హింసాత్మక సంఘటనలు జరిగితే తక్షణమే స్పందించి నియంత్రించేందుకు గట్టి చర్యలు చేపట్టామన్నారు. చెక్ పోస్టుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# చినవెంకన్న పెండ్లి కొడుకాయెనే..



శ్రీవారిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరిస్తున్న అర్చకులు



శ్రీ భూసమేత మహావిష్ణువు అలంకారంలో..



తూర్పు రాజగోపుర ప్రాంతంలో భక్తుల రద్దీ



గజ వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీవారు

- వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**ద్వారకాతిరుమల:** నుదుటున కల్యాణ తిలకం.. బుగ్గన చుక్కలతో సర్వాభరణ భూషితుడైన శ్రీవారు పెండ్లి కుమారుడిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు పెండ్లి కుమార్తెలుగా శోభిల్లారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలుత శ్రీహరి కళాతోరణ వేదికపై ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి, పుష్పాలంకారాలు చేశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసే వేడుక నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ఈఓ త్రినాథరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పూలు, పండ్లను సమర్పించి, పూజాదికాలు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ వైభవంగా జరిగిన ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలంకరించాయి. రాత్రి గజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల తొలిరోజు స్వామివారు శ్రీ భూసమేత మహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్త జనులతో పోటెత్తింది. సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు నిండిపోయాయి.

**బ్రహ్మోత్సవాల్లో నేడు**

- ఉదయం 7 గంటల నుంచి-భజన కార్యక్రమాలు
- ఉదయం 8 నుంచి-ఆధ్యాత్మిక నామ సంకీర్తన
- ఉదయం 9 నుంచి - సంగీత విభావరి
- ఉదయం 11 నుంచి-భరతనాట్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 నుంచి - నాదస్వరకచేరి
- సాయంత్రం 5 నుంచి - హరికథ
- సాయంత్రం 6 నుంచి-భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 8 నుంచి - సురభి నాటకం
- రాత్రి 8 నుంచి - అంకురార్పణ, రుత్విగ్వరణ, ధ్వజారోహణం
- రాత్రి 9 గంటల నుంచి - హంసవాహనంపై శ్రీవారికి తిరువీధి సేవ
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : కాళీయమర్దనం

### రిమాండ్ ముద్దాయిలకు ఉచిత న్యాయసేవలు

**తణుకు అర్బన్:** సబ్ జైలులో రిమాండ్ ముద్దాయిలకు అందించే సౌకర్యాల్లో ఎలాంటి లోపం రానివ్వవద్దని మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు సబ్‌జైలును శనివారం న్యాయమూర్తి సందర్శించి రిమాండ్ ముద్దాయిలతో మాట్లాడారు. వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న వారికి అవసరమైన ఉచిత న్యాయ సలహాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఏ ఒక్కరికి అన్యాయం జరిగే పరిస్థితి ఉండదని, న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేనివారికి మండల న్యాయసేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటుచేస్తామని స్పష్టం చేశారు. సబ్ జైలులో ఉన్న మహిళలు, పురుషులను కలిసి వారి కేసులపై ఆరా తీశారు. ముద్దాయిలకు అందుబాటులో ఉన్న వసతులతోపాటు ఆహారాన్ని కూడా న్యాయమూర్తి స్వయంగా పరిశీలించారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు, ప్యానల్ న్యాయవాదులు చింతపల్లి నాగేశ్వరరావు, ఎ.అజయకుమార్, టి.సత్యనారాయణరాజు, జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు, జైలు విజిటింగ్ డాక్టర్ శ్రీరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి డి.సత్యవతి

# రసవత్తరంగా నాటిక పోటీలు

**యలమంచిలి:** మండలంలోని కొంతేరు గ్రామంలోని శ్రీ పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో ప్రదర్శితమవుతున్న 42వ అఖిల భారత స్థాయి నాటిక పోటీలు ఆహుతులను ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. మనిషికి మరో మనిషి సాయం ఏ విధంగా కావాలి, జీవిత చరమాంకంలో ఏ ఇబ్బందులు రాకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి, మనిషి జీవించడానికి అవసరమైన ఆహారాన్ని అందిస్తున్న భూమిని, మనిషి పుట్టకకు కారణమైన ఆడదాన్ని ఏ విధంగా రక్షించుకోవాలో వివరిస్తూ శనివారం మూడు నాటికలు ప్రదర్శించారు. మూడు నాటికలు ఒకదానికొకటి పోటీ పడుతూ నాటక ప్రియులను అలరించాయి. రెండో రోజు నాటిక ప్రాంగణానికి కొంతేరు ప్రముఖ చిత్రకారుడు దివంగత బొందా రత్నం రాజు పేరు పెట్టారు.



నాటికల పోటీల్లో 'ఓ మనిషి కావాలి' నాటికలోని దృశ్యం

**ఆకట్టుకున్న 'ఓ మనిషి కావాలి'**
ఒక మనిషికి మరో మనిషి సాయం పడడం వల్ల ఏ విధమైన ప్రయోజనాలు ఉంటాయో పనసాల రచించి తంబు సురేష్‌బాబు దర్శకత్వం వహించిన ఓ మనిషి కావాలి నాటిక వివరించింది. ఆపదలో ఉన్న వారికి ఆర్థికంగానే కాకుండా శ్రమలో కూడా సహాయపడాలని నాటికలో చూపించారు. వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండే వారంతా ఒకచోట చేరి జీవితంలో వారికున్న మధురానుభవాలను పంచుకోవడం ద్వారా ఏ విధంగా సేదతీరవచ్చో నాటికలో వివరించారు.

**మలిసంధ్యలో..** ప్రతి మనిషికి తొలి రెండు సంధ్యలు (బాల్యం, యవ్వనం) ఏ విధంగా గడచినా మలి సంధ్య (వృద్ధాప్యం)లో ఏ విధంగా నెగ్గుకురావాలనే విషయాన్ని గోవిందరాజుల నాగేశ్వరరావు హృద్యంగా రచించగా పొన్నాడ ముత్యాలరావు దర్శకత్వంలో నటీనటులు పోటీపడి నటించారు. ముఖ్యంగా భార్యభర్తలు ఎలాంటి అరమరికలు లేకుండా సంసార జీవితాన్ని నెట్టుకు వస్తే జీవిత చరమాంకంలో ఎవరు ముందు శివసాన్నిధ్యాన్ని చేరుకున్నా.. రెండో మనిషి వారి జ్ఞాపకాలతో ఏ విధంగా మలిసంధ్యను దాటవచ్చో నాటికలో చక్కగా వివరించారు.

**ఆలోచింపజేసిన క్షేత్రం**
ఈ సృష్టిలో కేవలం ఇద్దరికి మాత్రమే పునరుత్పత్తి చేసే అవకాశం ఉంది. వాటిలో ఒకటి భూమి, రెండోది స్త్రీ మాత్రమే. భూమిని రక్షించుకోవడం ద్వారా పాడి పంటలను ఏ విధంగా సమృద్ధిగా పండిచవచ్చునో స్త్రీలను కూడా అదే విధంగా కాపాడుకోవాలో క్షేత్రం నాటిక వివరించింది. ఈ నాటికను ఆకురాతి శిల్ప రచించగా జివి మనోహర్ దర్శకత్వం వహించారు.

# స్కూళ్ల ప్రారంభంలోగా పుస్తకాలు అందించాలి

### విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

**భీమడోలు:** పాఠశాలలు ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాల్ని అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. భీమడోలు, గుండుగొలను ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో విద్యా కానుక స్టాక్ పాయింట్, డిజిటల్ విద్యావిధానం, నాడు నేడు పథకం పురోగతి, నూతన తరగతి గదుల పరిశీలన, పదో తరగతి ఫలితాలపై ఆయన సమీక్షించారు. భీమడోలు ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలు తెరిచిన వారం రోజుల్లో ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా చిన్నారుల సెల్‌ఫోన్లుకు ఈ-బుక్ లింకులను పంపి, ఎంతమంది డౌన్‌లోడ్ చేస్తుంది వివరాలపై ఆరా తీశారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో ప్రతి గదికి ఐఎఫ్ ప్యానళ్లు అందించాల్సి ఉండగా ఇంకా కొన్ని గదుల్లో ఏర్పాటు చేయకపోవడంపై సంబంధిత అధికారులను నిలదీశారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో 163 మంది విద్యార్థులకు 110 మంది పాసయ్యారని హెచ్ఎం బి.శ్రీనివాసరావు చెప్పగా.. విద్యార్థుల జాబితాను పరిశీలించిన ఆయన 21 మంది విద్యార్థులే అత్యధిక మార్కులు పొందారని, మిగిలిన విద్యార్థులు ఉత్తీర్ణత తక్కువగా ఉందన్నారు. ఉపాధ్యాయులంతా నాణ్యమైన విద్యను అందిస్తే ఆశించిన ఫలితాలు సొంతమవుతాయన్నారు. గుండుగొలను జూనియర్ కళాశాలలో పదో తరగతి పాసైన 110 మందిలో విద్యార్థులంతా చేరారా? అని హెచ్ఎం గారపాటి సునీతను అడిగారు. 42 మంది విద్యార్థులే చేరేందుకు సముఖత వ్యక్తం చేశారని హెచ్ఎం సమాధానమిచ్చారు. మిగిలిన విద్యార్థులంతా ఏ గ్రూపుల్లో ఏ కళాశాలలో చేరింది హెచ్ఎం చెప్పకపోవడంతో అసహనం వ్యక్తం చేసారు. పాఠశాలలోని స్కావెంజర్ల వేతనాలు రెండు, మూడు రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఆయన తెలిపారు.



భీమడోలులో పుస్తకాల ముద్రణను పరిశీలిస్తున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

## క్లుప్తంగా

### 23, 24 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఆదిత్య వర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆశ్రం మెడికల్ కళాశాల క్రికెట్ మైదానంలో ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 23వ తేదీన జరిగే సీనియర్స్ అండర్–23 విభాగంలో పోటీ పడే క్రీడాకారులు 2001 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. అలాగే 24న జరిగే అండర్–19 విభాగంలో 2005 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే పాల్గొనాలని వివరించారు. క్రీడాకారులు తమ సొంత కిట్‌లతో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్, మూడేళ్ల పాటు స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు. ఆసక్తి గలవారు జి.సత్యనారాయణ 94904 72111 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### చోరీ కేసులో వ్యక్తికి 6 నెలల జైలు

కామవరపుకోట: చోరీ కేసులో నేరం రుజువు కావడంతో ఓ నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ చింతలపూడి మెజిస్ట్రేట్ సీహెచ్ మధుబాబు శనివారం తీర్పునిచ్చారు. పోలీసులు, న్యాయవాది సమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మద్దా రాజారావు తన కుమార్తె వివాహం నిమిత్తం రూ.2.47 లక్షల నగదును ఇంట్లో బీరువాలో దాచాడు. 2021 డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ పండుగ సందర్భంగా రాజారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన బరతాల రత్నరాజు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న నగదును దొంగలించినట్లు బాధితుడు రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తడికలపూడి ఎస్సై కె.వెంకన్న కేసు నమోదు చేసి చార్జిషీటు ఫైల్ చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. తడికలపూడి ఎస్సై జయబాబు, కోర్టు కానిస్టేబుల్ డి.అనిల్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.



పెనుగొండ వాసవీ శాంతి ధాంలో వాసవీ హోమం



పెనుగొండలో 102 కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

## ఆధ్యాత్మికతతో విరాజిల్లిన పెనుగొండ

- భక్తుల వాసవీ నామస్మరణతో మార్మోగిన క్షేత్రం
- 102 కలశాలతో గ్రామోత్సవం.. వెండి పల్లకీ సేవ
- మంత్రాలయం నుంచి తరలివచ్చిన మాలధారులు
- ఆకట్టుకున్న గరగ నృత్యాలు, కోలాట భజనలు
- కనులపండువగా వాసవీ జయంతి



పెనుగొండ వాసవీ మాత్ర గ్రామోత్సవంలో ప్రత్యేక గరగ నృత్యాలు



పెనుగొండలో కలశం, ఇరుముడి ధరించిన చిన్నారులు

పెనుగొండ: పెనుగొండ క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. తొలి త్యాగశీలి, ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరిని భక్తులు జై వాసవీ.. జైజై వాసవాంబయ నమః నామస్మరణతో శనివారం క్షేత్రమంతా మార్మోగింది. వాసవీ మాత జయంతి సందర్భంగా పెనుగొండలోని మూల విరాట్ నగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో, అఖిల భారత పెనుగొండ శ్రీవాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాం తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నలుమూలల నుంచి వచ్చిన వాసవీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 7 గంటల నుంచి మహిళలు, వాసవీ మాలధారులు పెనుగొండలో ప్రసిద్ధ రామాలయం నుంచి ఆలయం వరకూ 102 కలశాలతో మహిళలు, వాసవీ మాతను వెండి పల్లకిపై ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలోని మూలవిరాట్ వాసవీ మాతకు వేద పండితులు రామడుగుల నరసింహమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వాసవీ మాలధారులు గణపతిహోమం, వాసవీ హోమం నిర్వహించి ఇరుముడులు సమర్పించారు. వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో వెండిరథంపై గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక గరగ నృత్యాలు, భజన మండళ్ల కోలాటాలతో ఆకట్టుకున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నూలి తాతాజీ, ట్రస్టీలు, దేవదాయ శాఖాధికారులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

### వాసవీ శాంతి ధాంలో..

అఖిలభారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానందపురిస్వామిజీ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు శిష్టా మణికంఠ మరకత వాసవీ మాతకు సహస్ర కలువార్చన, వాసవీ హోమం జరిపారు. భజనలు, దీపోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అలంకరణలో పెనుగొండ మూలవిరాట్ వాసవీ మాత



పెనుగొండ వాసవీ శాంతి ధాంలో మరకత శిల వాసవీ మాతకు సహస్ర కలువార్చన



పెనుగొండలో వాసవీ మాతకు వెండి పల్లకీ సేవ

### ప్రత్యేక ఆకర్షణగా పొర్లుదండాల స్వామి

వాసవీ మాత జయంతి ఉత్సవాల్లో పొర్లుదండాల స్వామి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మార్టేరుకు చెందిన ద్వారంపూడి విజయషణ్ముఖరెడ్డి బజారు రామాలయం నుంచి వాసవీ మాత మూలవిరాట్ ఆలయం వరకూ పొర్లు దండాలు పెట్టి వాసవీ భక్తులను ఆకట్టుకున్నారు. బజారు అంతా భక్తులు పసుపు నీళ్లు జిమ్ముతూ పొర్లుదండాల స్వామి, వాసవీ మాత కలశాలకు స్వాగతం పలికారు.





పెనుగొండలో వెండి రథంపై వాసవీ మాతకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## పెన్సిల్ లెడ్‌పై వాసవీ చరిత్ర



పెన్సిల్ లెడ్‌పై వాసవీ చరిత్రతో అన్నం మహిత

పెనుగొండ: పెన్సిల్ లెడ్‌పై సూదితో వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి చరిత్రను లిఖించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది చీరాలకు చెందిన విద్యార్థి అన్నం మహిత. శనివారం నిర్వహించిన గ్రామోత్సవంలో అమ్మవారి చరిత్ర ఫొటో ఫ్రేమ్‌తో ఆమె పాల్గొన్నారు. గ్రామోత్సవం అనంతరం మహితను ఆలయంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ నూలి తాతాజీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జయంతి ఉత్సవం సందర్భంగా ఆలయం వద్ద ఈ ఏడాది రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, పలువురు భక్తులు రక్తదానం చేశారు.

## హెచ్‌ఐవీ రోగులకు సత్వర వైద్యం

- తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌కు అందుబాటులోకి సీడీ ఫోర్ సేవలు
- ప్రభుత్వం చొరవతో రూ.50 లక్షల విలువైన పరికరం ఏర్పాటు
- గతంలో వారానికోసారి మాత్రమే పరీక్షలు.. నేడు ప్రతి రోజూ
- ఉమ్మడి జిల్లాలో 5 చోట్ల అందుబాటులో సీడీ ఫోర్ పరికరాలు
- తణుకులో సేవలు ప్రారంభించిన సూపరింటెండెంట్ అరుణ



తణుకు ఆస్పత్రిలో సీడీ ఫోర్ పరికరాన్ని ప్రారంభించిన సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు

తణుకు అర్బన్ : తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సేఫ్ కేర్ సెంటర్‌కు రూ.50 లక్షల విలువైన సీడీ ఫోర్ పరికరం ఉన్న ప్రత్యేక ల్యాబ్ అందుబాటులోకి రావడంతో హెచ్‌ఐవీ రోగులకు మరింత సత్వర వైద్యసేవలు అందనున్నాయి. హెచ్‌ఐవీ పాజిటివ్ నిర్ధారణ అయిన వెంటనే రోగి శరీరంలో రోగ నిరోధక శక్తి ఏ స్థాయిలో ఉందో తెలుసుకుని మందులు వాడించే ప్రక్రియ అందుబాటులో ఉంటుంది. వ్యాధి సోకిన వారి జీవిత కాలం పెంచే క్రమంలో ప్రతి రోగికి సీడీ ఫోర్ పరికరం ద్వారా వ్యాధి నిరోధక శక్తి కౌంట్ ఎంత ఉందో తెలుసుకోవడం ప్రధాన భూమిక. ఈ రక్తపరీక్షలో 350 కన్నా కౌంట్ తక్కువగా ఉంటే రోగ నిరోధక శక్తి తగ్గుతున్నట్లుగా గుర్తించి క్రమం తప్పకుండా సంబంధిత మందులు వాడిస్తూ మూడు నెలలకోసారి సీడీ ఫోర్ పరీక్ష చేయిస్తూ ఉంటారు. ఆరోగ్యకరంగా ఉన్న వారిలో సుమారుగా 1400లుగా ఉండే ఈ కౌంట్ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల్లో మాత్రం తగ్గే పరిస్థితి ఉంటుంది. దీంతో వ్యాధిగ్రస్తులకు టీబీతోపాటు పలురకాల రోగాలు చుట్టేస్తాయని వైద్యాధికారులు చెబుతున్నారు. సదరు కౌంట్ తెలుసుకుని మందులు వాడడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు.

### గతంలో తాడేపల్లిగూడెం, ఏలూరు ఆస్పత్రుల్లో మాత్రమే సేవలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రితోపాటు ఆశ్రం ఆస్పత్రి, జంగారెడ్డిగూడెం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకులో హెచ్‌ఐవీ బాధితులకు సేఫ్ కేర్ సెంటర్ల ద్వారా 22,592 మందికి వైద్యసేవలు అందుతున్నాయి. అయితే ఆశ్రం ఆస్పత్రి సెంటర్‌కు సంబంధించి ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న సెంటర్‌కు పంపిస్తున్నారు. తణుకు సేఫ్ కేర్ సెంటర్లలో ఈ పరికరం ఇప్పటివరకు అందుబాటులో లేదు. దీంతో రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి తాడేపల్లిగూడెం, ఏలూరు సేఫ్ కేర్ సెంటర్‌లకు వారానికోసారి పరీక్షలకు పంపించే పరిస్థితి ఉండేది. కానీ తాజాగా తణుకు సేఫ్ కేర్ సెంటర్‌లో పరికరం అందుబాటులోకి రావడంతో ఇకపై నిత్యం ఇక్కడ సీడీ ఫోర్ పరీక్షలు నిర్వహించే వెసులుబాటు దక్కింది. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) ద్వారా ఏలూరు, తాడేపల్లిగూడెం సేఫ్‌కేర్ సెంటర్‌లకు ఈ పరికరాలు అందుబాటులోకి రాగా, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జంగారెడ్డిగూడెం, భీమవరం సెంటర్‌లకు పరికరాలు గతంలోనే అందుబాటులోకి వచ్చాయి. తాజాగా రోగుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రూ.50 లక్షల నిధులతో సమకూర్చిన సీడీ ఫోర్ పరికరం నెల క్రితమే కేంద్రానికి అందుబాటులోకి రాగా, ఆస్పత్రి ఆవరణలో ఎయిర్ కండిషన్‌తో ప్రత్యేక ల్యాబ్ రూమ్‌కు అన్ని వసతులు కల్పించి పరీక్షలు ప్రారంభించారు. దీంతో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు మరింత సత్వర సేవలు అందనున్నాయి.



సీడీ ఫోర్ పరికరం

### ఇక ప్రతిరోజూ పరీక్షలు

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల రోగ నిరోధక శక్తి సామర్థ్యాన్ని తెలిపే సీడీ ఫోర్ పరికరం తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు అందుబాటులోకి రావడం మంచి పరిణామమని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. తణుకు ఆస్పత్రి ఆవరణలో ఉన్న సేఫ్ కేర్ సెంటర్‌లోకి అందుబాటులోకి వచ్చిన సీడీ ఫోర్ పరికరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు సీడీ ఫోర్ పరీక్షలు ఏలూరు, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు రక్త నమూనాలు తీసుకు వెళ్లి పరీక్షలు చేయిస్తున్నారని పరికరం అందుబాటులోకి రావడంతో ఇకపై ఏ రోజుకారోజే పరీక్షలు నిర్వహించవచ్చన్నారు. తణుకు ఆస్పత్రి ఆవరణలో ఉన్న సేఫ్ కేర్ సెంటర్ ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు ఎంతో సౌకర్యవంతమైన వైద్యసేవలు అందుతున్నాయని, ఈ పరికరం ద్వారా వచ్చే కౌంట్‌ను బట్టి రోగులకు చికిత్స అందించనున్నారని చెప్పారు. ఈ రక్త పరీక్షల కోసం ఆస్పత్రి ఆవరణలోని భవనాన్ని కేటాయించి పూర్తి ఎయిర్ కండిషన్ ల్యాబ్ విభాగంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు చక్రధరరావు, శారద, చక్రవర్తి, దుర్గాప్రసాద్, సాయి బాలాజీ, రఘువీర్, పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, వైద్యులు ఉషారాణి, సేఫ్‌కేర్ సెంటర్, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడిలో పండు ఈగ ఉధృతి

నూజివీడు: అకాల వర్షాల వల్ల మామిడితోటల్లో పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున దీని నివారణకు రాలిపోయిన మామిడి పండ్లను ఏరి నాశనం చేయాలని నూజివీడు మామిడి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనక మహాలక్ష్మి రైతులకు సూచించారు. ఏలూరు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్‌రావు, నూజివీడు హెచ్‌వో ఆర్.హేమలతతో కలిసి మండలంలోని వెంకటాయపాలెం, అన్నవరం, దిగవల్లిలలోని మామిడి తోటలను వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కనక మహాలక్ష్మి మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల బంగినపల్లి రకం కాయల తొడిమ వద్ద నుంచి కాయకుళ్లు రావడానికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పక్వానికి వచ్చిన కాయలను వీలైనంత త్వరగా కోయాలని సూచించారు. కాయకుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బన్‌డిజమ్ ఒక గ్రాము లీటరు నీటికి లేదా క్లోరోథలామిల్ లేదా ప్రొఫినెబ్ 2గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే పండుఈగ నివారణకు ప్లాస్టిక్ పళ్లెంలో యూజీనాల్ రెండు మిల్లీలీటర్లు, మూడు గ్రాములు కార్బోఫ్యూరాన్ 3జీ లీటరు నీటిలో కలిపి తోటలో వేలాడదీయాలన్నారు. రెండు మిల్లీలీటర్ల మలాథియాన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరానికి 4 నుంచి 6 వరకు తోటల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే కాయలను పండించడానికి కార్బైడ్‌ను వాడరాదని, ఇథలీన్ గ్యాస్‌ను గాని, ఇథలీన్ ప్యాకెట్లను గాని ఉపయోగించాలన్నారు. కాపు తక్కువగా ఉన్నందున కాయ కోత సమయంలో జాగ్రత్త తీసుకోవాలని, తొడిమతో సహా కోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

### ఏడుగురిపై విద్యుత్ చౌర్యం కేసుల నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని కొయ్యలగూడెం మండలం యర్రంపేట, రాజవరం గ్రామాల్లో విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నారని అందిన సమాచారంపై ఏలూరు విద్యుత్ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక దాడులు చేసి ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వీ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఏడుగురు వ్యక్తులు తమ గృహాల్లోని ఏసీలకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి రూ.3,16,694 అపరాధ రుసుము, రూ.26 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## క్లుప్తంగా

### ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



లక్కీడిప్ గిఫ్టలను అందజేస్తున్న డిపో మేనేజర్

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమని, ప్రయాణీకులకు ప్రయాణావసరాలను తీర్చడమే కాకుండా ప్రోత్సాహక బహుమతులను ప్రతి 15 రోజులకొకసారి అందిస్తుందని ఆర్టీసీ బస్సులను ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణీకులకు ప్రోత్సాహక బహుమతులు శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన లక్కీడిప్ ద్వారా అందజేశారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం భీమవరం రూట్లలో విజేతలకు దాతల సహాయ సహకారాలతో బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో గ్యారేజ్ ఇన్‌చార్జి కె.చిట్టిబాబు, యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణీకులు హాజరయ్యారు.

### విద్యార్థులకు బొమ్మల తయారీపై శిక్షణ



విద్యార్థులకు కాగితాలతో బొమ్మలు తయారీపై శిక్షణ ఇస్తున్న రిసోర్సుపర్సన్

**అత్తిలి:** వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో శనివారం కాగితాలతో బొమ్మలు తయారీపై రిసోర్సుపర్సన్ కె కోమలి శిక్షణ ఇచ్చారు. విద్యార్థులతో కాగితాలతో పలు రకాల వస్తువులను తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని గ్రంథాలయంలో వినియోగించుకునే విధంగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు లైబ్రేరియన్ గంధం శేషేంద్రరావు, జి గణపతి, ఎం శ్రీదేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

### వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి

**అత్తిలి:** ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చనలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేసారు.

### బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



ఇరగవరంలో బడిఈడు పిల్లల నమోదులో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు

**ఇరగవరం:** బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి జీబీవీ ప్రసాద్ అన్నారు. శనివారం ఇరగవరం మండలంలో బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు ఎంటీ గాలేశ్వరరావు, వై జగదీష్ పాల్గొన్నారు.

### గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో శనివారం సమ్మర్ క్లాసులు ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రత్తి వీరాస్వామి సైన్సులోని పలు అంశాలను అవగాహన కలిగించి ఆటలు ఆడించారు. వి.రామాంజనేయులుచే విద్యార్థులకు ఆధ్యాత్మిక అంశాలను, గరికిపాటి బాపయ్య శర్మ ఇంగ్లీషు గ్రామర్, కె.వెంకట సత్య ప్రకాశ్ స్పోకెన్ ఇంగ్లీషు అంశాలు వివరించారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోండి



దండగర్రలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



బాస్కెట్ బాల్ క్రీడాకారులతో విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని దండగర్రలో శనివారం సాయంత్రం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఎలా ఉపయోగపడుతున్నాయో ఉపాధ్యాయులతో ఆపరేటింగ్ చేయించి, అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల గృహాలను సందర్శించి, పాఠ్య పుస్తకాలు, సిలబస్‌పై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల ఉత్తీర్ణత శాతంలో తేడాలు, విద్యా బోధన వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఏపీసీ శ్యామ్ సుందర్, ఏఎంవో రామకోటేశ్వరరావు, సీఎంవో చంద్రశేఖర్, డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవోలు వి.హనుమ, జ్యోతి, డీఈవో సూపరింటెండెంట్ రాజు, ఐటీ సెల్ సభ్యులు ఉన్నారు.

**పాఠ్యపుస్తకాల కేంద్రం పరిశీలన**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా స్టాక్ కేంద్రాన్ని శనివారం ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు. డిపోలో ఉన్న అన్ని రకాల బుక్స్ టైటిల్స్, పంపిణీ తదితర అంశాలను బుక్స్ డిపో జిల్లా మేనేజర్ టి.భాస్కరరావును ప్రవీణ్ ప్రకాష్ అడిగి తెలుసుకున్నారు. డిపోను పరిశుభ్రంగా ఉంచడంపై మేనేజర్‌ను అభినందించారు. కడకట్లలోని పాఠ్యపుస్తకాల స్టోరేజీ పాయింట్‌ను పరిశీలించారు. బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో క్రీడాకారులతో మాట్లాడుతూ వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. క్రీడాకారులకు శిక్షణనిస్తున్న పీడీ చింతకాయల సత్యనారాయణను అభినందించారు. ఎంఈఓ జ్యోతి ఉన్నారు.

## అలరించిన జాతీయస్థాయి నృత్య పోటీలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** జాతీయస్థాయి నృత్య పోటీలు బీవీఆర్ కళాకేంద్రం ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం సుబ్బారావుపేట బీవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. 200 మంది పోటీలో పాల్గొన్నారు. భరత నాట్యం, కూచిపూడి, జానపదం, తదితర నృత్యాలను ప్రదర్శించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు హాజరయ్యారు. గండికోట రాజేష్, నండూరి రాధిక న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రాత్రి 7 గంటలకు నాట్యాచార్య రిత్విక్ వెంకట్, ఛార్మిళ వెంకట్, కె.సోమనాథ్ భరద్వాజ్‌చే కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు మాట్లాడుతూ జాతీయ స్థాయి నృత్య పోటీలు ఆదివారం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పీటీ వెంకన్న, దాసరి కాశీ విశ్వనాథం, కొప్పిశెట్టి రమణయ్య, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, పైలు శ్రీనివాసరావు, సరస్వతుల హనుమంతరావులు పర్యవేక్షించారు. కళాకారులు, సాహితీ ప్రముఖులు తదితరులు హాజరయ్యారు.



జాతీయస్థాయి నృత్య పోటీలు

# వైభవంగా కనక ముత్యాలమ్మ జాతర



ముదునూరుపాడులో కనకముత్యాలమ్మవారు



ఆలయం వద్ద బుర్ర కథ ప్రదర్శనను తిలకిస్తున్న భక్తులు

**పెంటపాడు:** ఫిబ్రవరి 29 నుంచి ప్రారంభమైన ముదునూరుపాడు గ్రామ దేవత కనకముత్యాలమ్మవారి జాతర ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమ ముగింపు, ఆగమ జాతర, పాన్పు పురస్కరించుకొని శనివారం సాయంత్రం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ గ్రామస్తుల సమక్షంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వైభవంగా నిర్వహించే ఈ జాతరలో భాగంగా మార్చి 23న అమ్మవారి మొదటి సేవ, ఏప్రిల్ 21న అమ్మవారి రెండో సేవ, ఏప్రిల్ 28న అమ్మవారి మూడో సేవ ఘనంగా నిర్వహించామన్నారు. జాతర ముగింపు పురస్కరించుకొని మే 18న అగమ జాతర, 19న పాన్పు, తదితర కార్యక్రమాలు వైభవంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ జాతర మహోత్సాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కమిటీ సంఘం కోరింది. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి పాన్పు సేవ, నైవేద్యాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

## వీఆర్‌ఏల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం

**అత్తిలి:** వీఆర్‌ఏల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు మీసాల కృష్ణమూర్తి ఆకస్మిక మృతికి వీఆర్‌ఏల సంఘం జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. శనివారం వీఆర్‌ఏల సంఘం, సీఐటీయూ నాయకులు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేసారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు మాట్లాడుతూ అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి వీఆర్‌ఏల సంఘానికి అనేక సేవలు అందించారన్నారు. జిల్లా అంతా తిరిగి మండలాల్లో వీఆర్‌ఏలని ఐక్యం చేయడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేసారని చెప్పారు. ఆయన మరణం తీరనిలోటని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వీఆర్‌ఏల ఐక్యత కోసం పనిచేసిన మీసాల కృష్ణమూర్తి వీఆర్‌ఏలందరికి గుర్తుండిపోయే వ్యక్తిని అన్నారు. ఆయన సేవలను ఎన్నటికీ మర్చిపోలేమని అన్నారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహాయం తక్షణమే అందించేందుకు అధికారులతో మాట్లాడతామని వారు చెప్పారు. కార్యక్రమంలో కేతా గోపాలం, ఎం ఆంజనేయులు, ధర్మేంద్ర, రాంబాబు పాల్గొన్నారు.



బల్లిపాడులో కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

# ఘనంగా వాసవి మాత జన్మదినోత్సవం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** శ్రీ వాసవి మాత జన్మదినోత్సవం సందర్భంగా శనివారం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాతకు 108 వెండి కలశ పూజలు, 108 సువాసినులతో వెండి కలశాలతో దేవాలయ ప్రదక్షిణలు అనంతరం మూల విరాట్‌కు పంచామృతాలతో, పండ్ల రసాలతో సుగంధ ద్రవ్యాలతో, పసుపు, కుంకుమ, పాలతో విశేష అభిషేకాలు, మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తుల సహకారంతో సుమారు 10 కేజీల వెండితో వెండి చీర, వివిధ రకాలైన పుష్పాలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం బైక్ ర్యాలీ నిర్వహించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు హాజరై పూజలు చేశారు. ఆర్య వైశ్య సంఘ సభ్యులు, మహిళలు చక్క వెంకటరామరమణ మూర్తి, రాధా, మారం వెంకటేశ్వరరావు, కె.శ్రీరామ చంద్రమూర్తి, నున్న బాల త్రిపుర సుందరరావు, బి.రమేష్, ఆలపాటి సత్యనారాయణ, పేరూరి కాశయ్య, గ్రంధి సత్యనారాయణ, నటరాజ్, పచ్చిపులుసు శారదా రాణి పాల్గొన్నారు.



విశేష అలంకరణలో వాసవి అమ్మవారు

## నాటికలతో సమాజంలో చైతన్యం

**భీమవరం:** నాటికలతో సమాజంలో చైతన్యం తీసుకురావచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. కళారంజని 13వ వార్షికోత్సవ జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు శనివారం భీమవరంలోని సోమేశ్వర జనార్దన స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. సమాజంలో మార్పు తేవడానికి నాటకాలే ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా నాటక కళాకారులు కావూరి సత్యనారాయణకు ఎస్వీ రంగారావు స్మారక పురస్కారం, కోనేటి సుబ్బరాజుకు యశోభూషణ అవార్డును, ఎస్.డేవిడ్ రాజుకు జవ్వాది సూర్యారావు స్మారక పురస్కారం, బాలగోపాల త్రినాథరాజుకు చుక్కన శ్రీ పురస్కారం అందచేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జె.దాశరథి శ్రీనివాస్, గుండా రామకృష్ణ, నల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన ×అమృత హస్తం×, ×మట్టి పరిమళం× నాటిక అలరించాయి.

## వైఎస్సార్‌సీపీకి విజయం ఖాయం

**పాలకొల్లు అర్బన్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ జోస్యం చెప్పారు. ఈ మేరకు చంద్రకళ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ 135 స్థానాలు పైగా గెలవబోతోందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిద్ధం మహాసభలు నిర్వహించి, బస్సు యాత్ర ద్వారా బహిరంగ సభలను సీఎం జగన్ నిర్వహించి వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కేడర్‌లో కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రానుందనే ఉత్సాహంతో ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో గ్రామీణ ఓటర్లు, ముఖ్యంగా మహిళా ఓటర్లు అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని చంద్రకళ తెలిపారు. సీఎం జగన్ గత ఐదేళ్లుగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా నిలుస్తాయని వివరించారు.

## అన్నప్రసాద వితరణకు ప్లేట్లు అందజేత

**పాలకొల్లు సెంట్రల్:** స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతి మంగళవారం భక్తులకు స్వామివారి అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాత జీఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ దంపతులు శనివారం రూ. 10 వేలు విలువ చేసే ప్లేట్లు, బకెట్లు ఆలయ ప్రధానార్చకులు రమణ గురుస్వామికి అందజేశారు. దాతల సహకారంతో ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలను సత్కరించారు.

## సంయమనం పాటించాలి

**పెనుగొండ:** నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్స్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్‌లో భీమవరంలో పటిష్ఠ భద్రతల మధ్య జాగ్రత్తగా భద్రపర్చామని, ఏదైనా సంఘటనపై స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా సంయమనం పాటించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మీపోర్స్, పోలీస్ టీంలు నిత్య పర్యవేక్షణ ఉంటుందని, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణలో మూడంచెల భద్రత పహారా ఉందని వివరించారు. జూన్ 4న నియోజకవర్గంలో పోల్ అయిన ఓట్లు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా లెక్కిస్తారని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని, జూన్ 4 వరకూ ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పరమైన సమావేశాలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. గ్రామాల్లోకవ్వింపు చర్యలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**మొగల్తూరు:** స్థానిక కేతకీపుర సామ్రాజ్య శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదవితరణ నిర్వహించారు.

**వైభవ వేంకటేశ్వరుని అలంకరణ**

**నరసాపురం రూరల్:** మండలంలోని కాపులకొడప గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు వైభవ వెంకటేశ్వరునిగా పూలతో ప్రత్యేంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.



మొగల్తూరులో వెంకన్న ప్రత్యేక అలంకరణ

# అధిక రక్తపోటుపై అవగాహన



పాలమూరులో అధిక రక్తపోటు నివారణపై అవగాహన కల్పిస్తున్న గుడాల హరిబాబు

**పాలకొల్లు అర్బన్:** గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజల్లో ఎక్కువశాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు చెప్పారు. మండలంలోని పాలమూరులో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు అధిక రక్తపోటుపై అవగాహన కల్పించారు. 30 సంవత్సరాలు దాటినవారికి బీపీ పరీక్షలు నిర్వహించి అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారిని గుర్తించి మందులు అందజేసి సూచనలు చేశారు. ప్రతిరోజూ ఆహారంలో ఉప్పుశాతం పెరగడం వల్ల అధిక రక్తపోటు పెరుగుతుందని, దీనివలన గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. శిబిరంలో డాక్టర్ నవ్యజీవన్ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ డి.కమల, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# చిదంబరానికి సత్కారం



హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిగినీడి చిదంబరాన్ని సత్కరిస్తున్న కాపు సంఘ నాయకులు

**నరసాపురం:** కలిగినీడి చిదంబరం తన సేవలతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా నరసాపురం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారని నరసాపురం నియోజకవర్గ కాపుసంఘం నాయకులు పేర్కొన్నారు. ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పట్టణానికి చెందిన చిదంబరం శనివారం పట్టణంలోని 31వవార్డు చినమామిడిపల్లిలోని తన సొంతింటికి వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాపుసంఘం నాయకులు చిదంబరాన్ని ఘజమాలతో సత్కరించారు. మెమెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కోటిపల్లి సురేష్, చిట్టూరి కృష్ణ, తెన్నేటి గిరి, బళ్ల తాతాజీ, వన్నెంరెడ్డి శ్రీనివాస్, పోలిశెట్టి సూరిబాబు, అందే వెంకటకృష్ణ, మేడిది రాము తదితరులు పాల్గొన్నారు.

### తాడేపల్లిగూడెంలో యోగా శిక్షణ తరగతులు

**పెంటపాడు:** వేసవి సెలవులు పురస్కరించుకొని గూడెం కడకట్ల కోడే వెంకటరావు హైస్కూల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు జి. రూప తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఈ యోగా తరగతులు కొనసాగుతాయన్నారు. ఉచితంగా నిర్వహించబోయే ఈ తరగతులు మే నెల 30 వరకు కొనసాగుతాయన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా నిర్వహించే ఈ యోగా క్లాసులలో విద్యార్థులు, గృహిణిలు, చిన్నారులు, ఉద్యోగులు తప్పక పాల్గొనాలన్నారు.